క్లుప్తంగా

మాజీ రాష్ట్రపతి అబ్దుల్‌కలాంకు నివాళి



గుడివాడరూరల్: జాతి గర్వించదగ్గ మహోను భావుడు మాజీ రాష్ట్రపతి ఏపీజే అబ్దుల్‌కలాం అని ఎన్టీఆర్ స్టేడియం రోటరీ క్లబ్ సభ్యులు పేర్కొన్నారు. అబ్దుల్‌కలాం వర్ధంతిని పట్టణంలోని మమతా వృద్ధాశ్రమంలో గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా సభ్యులు వృద్ధులకు రొట్టెలు, పండ్లు పంపిణీ చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ కలాంను నేటి యువత ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఫౌండర్ అధ్యక్షుడు ఈశ్వర వెంకటేశ్వరరావు, అధ్యక్షుడు ఆర్జా ప్రసాద్, ట్రస్ట్ చైర్మన్ లింగం చిట్టిబాబు, సభ్యులు బొప్పన కుటుంబరావు, కోన రామారావు పాల్గొన్నారు.

ముంపు పొలాల పరిశీలన

కైకలూరు: అల్పపీడనం వల్ల కురుస్తున్న వర్షాలకు ముంపు బారిన పడిన పొలాలను వ్యవసాయశాఖ సహాయ సంచాలకులు జి.గంగాధరరావు ఆధ్వర్యంలో గురువారం పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ.. కైకలూరు సబ్ డివిజన్‌లో 4,176 ఎకరాలు వరిసాగు చేపట్టారన్నారు. వర్షాలకు కైకలూరు మండలంలో 108 ఎకరాలు, కలిదిండి మండలంలో 280 ఎకరాలు నీటి మునిగాయన్నారు. గోపవరంలో పుల్లవ డ్రెయిన్‌లో నీరు పొలాలకు చేరిందన్నారు. దీంతో డ్రెయినేజీ, ఇరిగేషన్ శాఖల అధికారులతో పుల్లవ డ్రెయిన్‌ను పరిశీలించామన్నారు. అనంతరం అధికారులు తామరకొల్లు, వింజరం, వేమవరప్పాడు గ్రామాల్లో పొలాలను పరిశీలించారు. ఏవో దివ్య, ఎన్ఆర్ఈజీఎస్ ఏపీవో శరణ్ పాల్గొన్నారు.

డ్వాక్రా నిధుల దుర్వినియోగంపై కేసు నమోదు

తోట్లవల్లూరు: డ్వాక్రా నిధులు దుర్వినియోగం చేసిన ఘటనలో ఓ మహిళపై తోట్లవల్లూరు పోలీస్‌స్టేషన్‌లో చీటింగ్ కేసు నమోదైంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. పెనమకూరు గ్రామానికి చెందిన శ్రీమంజు డ్వాక్రా గ్రూపు ఉపాధ్యక్షురాలు కొల్లిపర ఉమాశ్రీ రూ.11.18 లక్షలు బ్యాంకుకు జమ చేయకుండా దుర్వినియోగానికి పాల్పడిందని సంఘ అధ్యక్షురాలు అంబడిపూడి సీతామహాలక్ష్మి పోలీసులకు ఫిర్యాదు చేశారు. సభ్యుల నుంచి వసూలు చేసిన సొమ్ము గత కొంతకాలంగా సొంతానికి వాడుకుంటూ సభ్యులను మోసం చేసిందని, ఆమెపై తగిన చర్యలు తీసుకోవాలని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఉమాశ్రీపై చీటింగ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ జి.రమేష్ తెలిపారు.

నిందితులను కఠినంగా శిక్షించాలి

గుడివాడరూరల్: మైనర్ బాలికపై అత్యాచారం చేసిన నిందితులను వెంటనే కఠినంగా శిక్షించాలని గుడివాడ దళిత, ముస్లిం సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. ఇటీవల పామర్రు మండలం నిభానుపూడి గ్రామంలో 9వ తరగతి చదువుతున్న దళిత బాలికను నమ్మించి, అత్యాచారం చేసి చావుకు కారణమైన నిందితులను శిక్షించాలని కోరుతూ గుడివాడ ఆర్డీవో కార్యాలయం వద్ద గురువారం నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా దళిత నాయకుడు పొంగులేటి జయరాజు, ముస్లిం నాయకులు అబ్దుల్ బేగ్, మునీర్ బాషాలు మాట్లాడుతూ.. అత్యాచారాలకు పాల్పడుతున్న నిందితులను శిక్షించేందుకు ప్రభుత్వాలు కఠినమైన చట్టాలను అమల్లోకి తీసుకురావాలని కోరారు. దళిత నాయకుడు సుధాకర్, నాయకులు పాల్గొన్నారు.

కుప్పకూలిన తహసీల్దార్ కార్యాలయం వరండా



పామర్రు: ప్రస్తుతం కురుస్తున్న వర్షాలతో స్థానిక తహసీల్దార్ కార్యాలయం వరండా గురువారం ఒక్కసారిగా కూలిపోయింది. ఉద్యోగులు, స్థానిక ప్రజలతో ఆ ప్రాంతం ఎప్పుడూ బిజీ బిజీగా ఉంటుంది. కాని వర్షాల కారణంగా ఆ ప్రాంతంలో ఎవ్వరూ లేకపోవడం పెనుప్రమాదం తప్పిందని ఉద్యోగులు పేర్కొన్నారు. ఎవరికీ ఎలాంటి ప్రమాదం జరుగకపోవడంతో తహసీల్దార్ కార్యాలయ సిబ్బంది ఊపిరిపీల్చుకున్నారు.

అన్నదాతలను ప్రభుత్వం ఆదుకోవాలి

తోట్లవల్లూరు: వర్షాల కారణంగా నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని కౌలురైతు సంఘం రాష్ట్ర ప్రధానకార్యదర్శి ఎం .హరిబాబు డిమాండ్ చేశారు. మండలంలోని భద్రిరాజుపాలెంలో నీటి ముంపునకు గురైన వరి పొలాలను గురువారం ఆయన పరిశీలించారు. నష్టపోయిన రైతులను, కౌలురైతులను గుర్తించటంతో పాటు ప్రత్యామ్నాయ పంటలు వేసుకునేందుకు అవసరమైన విత్తనాలు ప్రభుత్వమే అందించాలని కోరారు. మండల కమిటీ అధ్యక్షుడు చాగంటిపాటి సుబ్బారావు, జోజి, మరియదాస్, కౌలురైతులు పాల్గొన్నారు.

వర్షాలకు నష్టపోయిన రైతులను ఆదుకుంటాం

పామర్రు ఎమ్మెల్యే కైలే అనిల్‌కుమార్

ప్రాకర్ల(పామర్రు): అకాల వర్షాల కారణంగా పంట నష్టపోయిన రైతులను సత్వరమే ఆదుకుంటామని పామర్రు ఎమ్మెల్యే కై లే అనిల్‌కుమార్ స్పష్టం చేశారు. మండల పరిధి ప్రాకర్ల, ఎలకుర్రు గ్రామాల్లో వర్షాల కారణంగా ముంపునకు గురైన వరి పంట పొలాలను ఇరిగేషన్, డ్రెయినేజీ శాఖల అధికారులతో కలిసి ఆయన గురువారం పరిశీలించారు. అక్కడి రైతుల పంట పొలాల పరిస్థితి, ప్రస్తుత స్థితిగతుల గురించి అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. పంట పొలాల ముంపునకు కారణాలను తెలుసుకుని వాటిని సత్వరమే పరిష్కరించే విధంగా తగు చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. పామర్రు, గూడూరు మండలాల పరిధిలో ఉన్న మురుగు డ్రెయిన్‌లోని కల్వర్టు వద్ద నీరు సక్రమంగా ప్రవహించడం లేదన్నారు. దీని కారణంగా వర్షపు నీరు దిగువకు వెళ్లటం లేదని, దీనికి ప్రత్యామ్నాయంగా కల్వర్టు పక్కనే ఆయిల్ ఇంజిన్లు ఏర్పాటు చేసి వాటి సహాయంతో నీటి తొలగింపు చర్యలు తీసుకోవాలని చెప్పారు. ఖరీఫ్ సీజన్ వచ్చే ముందే అధికారులు స్పందించి మురుగు డ్రెయిన్లను శుభ్రం చేయించి అభివృద్ధి చేయించాల్సిందన్నారు. భవిష్యత్‌లో ఇటువంటి సమస్యలు లేకుండా ఇరిగేషన్, డ్రెయినేజీ అధికారులు కలిసి సంయుక్తంగా కార్యాచరణ ప్రణాళికలను రూపొందించుకోవాలని ఆదేశించారు.



అధికారులకు సూచనలిస్తున్న ఎమ్మెల్యే అనిల్‌కుమార్, పక్కన నాయకులు



రైతులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కైలే

రైతులు నష్టపోకుండా చూస్తాం

నియోజకవర్గంలోని రైతులు ఎవ్వరూ వర్షాల కారణంగా నష్టపోకుండా తగు విధమైన చర్యలు తీసుకుంటామని ఎమ్మెల్యే కై లే చెప్పారు. అధిక వర్షాలకు నీట మునిగిన పొలాలలో నీటిని తొలగిస్తామన్నారు. సంబంధిత అధికారులతో కలిసి సమస్యలను పరిష్కరించే విధంగా కృషి చేస్తామన్నారు. భవిష్యత్‌లో రైతులకు డ్రెయినేజీల సమస్యలు లేకుండా చూస్తామన్నారు. రైతుల సమస్యలపై అధికారులతో చర్చించారు. కార్యక్రమంలో ఎంపీపీ దాసరి అశోక్‌కుమార్, ఎంపీటీసీ పి.రత్నకుమారి, ఉప సర్పంచ్ దేవిరెడ్డి బాల వెంకటేశ్వరరెడ్డి, ఎలకుర్రు సిగ్మెంట్‌లోని నాలుగు గ్రామాల సర్పంచ్‌లు, ఇరిగేషన్, డ్రెయినేజీ శాఖల అధికారులు పాల్గొన్నారు.

మొవ్వ మండలంలో పరిశీలన

పెద్దారాయుడుతోట(మొవ్వ): డ్రెయిన్లలో తూటి కాడ, గుర్రపు డెక్కను తొలగించాలని ఎమ్మెల్యే కై లే అనిల్‌కుమార్ అధికారులకు సూచించారు. మొవ్వ మండలంలో నీట మునిగిన పంట పొలాలను ఎమ్మెల్యే కైలే గురువారం డ్రెయినేజీ ఈఈ విజయలక్ష్మితో కలిసి పరిశీలించారు. మండల పరిధిలోని కోళ్లపాలెం, పెద్దారాయుడు తోట, కాజ, కోసూరు, కారకంపాడు గ్రామాల్లోని పంట పొలాలను ఎమ్మెల్యే పరిశీలించారు. పొలాల్లో చేరిన వర్షపు నీరు పారే విధంగా డ్రెయిన్ సౌకర్యాన్ని మెరుగు పర్చే విధంగా అధికారులకు సూచనలిచ్చారు. అలాగే మండలాల వారీగా పంట నష్టంపై అంచనాలు వేసి ప్రభుత్వానికి నివేదిస్తామని తెలిపారు. ఏవో కె.శివప్రసాద్, సర్పంచ్‌లు తాతా స్వప్న, పెనుమూడి రమేష్, ఎంపీటీసీ మురారి సత్యనారాయణ, నాయకులు గోగినేని పెరుమాళ్లు, మంద శ్రీనివాసరెడ్డి, రాజులపాటి మురళీ పాల్గొన్నారు.

మోపర్రు(పెదపారుపూడి): అకాల వర్షాలతో దెబ్బతిన్న పంటల వివరాలను సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దృష్టికి తీసుకుని వెళ్లి రైతులకు న్యాయం జరిగేలా చూస్తానని ఎమ్మెల్యే కైలే రైతులకు తెలిపారు. మండలంలోని మోపర్రు, వింజరంపాడు, పెదపారుపూడి, వానపాముల, యలమర్రు గ్రామాల్లో వర్షాల వలన నీటి మునిగిన పొలాలను ఎమ్మెల్యే గురువారం పరిశీలించారు. చెరువులను తలపిస్తున్న వరి పొలాలను చూసి ఎమ్మెల్యే చలించిపోయారు. వన్నేరు డ్రెయిన్‌లో గుర్రపుడెక్క తొలగించాలని డ్రెయినేజీ ఈఈ విజయలక్ష్మిని ఆదేశించారు. ఎంపీపీ గోగం సురేష్, పామర్రు మర్కెట్ యార్డు డైరెక్టర్ చీకుర్తి వరప్రసాద్, సచివాలయాల కన్వీనర్ జాజుల చిన్నారి, నాయకులు పాల్గొన్నారు.

‘వర్ల అనుచిత వ్యాఖ్యలు తగదు’



వరప్రసాద్, పామర్రు మార్కెట్ యార్డు డైరెక్టర్

పెదపారుపూడి: పామర్రు నియోజకవర్గ ప్రజల అభ్యున్నతికి పాటుపడుతున్న ఎమ్మెల్యే కైలే అనిల్ కుమార్‌పై టీడీపీ నేత వర్ల కుమార్ రాజా చేసిన అనుచిత వ్యాఖ్యలు తగదని పామర్రు మార్కెట్‌యార్డు డైరెక్టర్ చీకుర్తి వరప్రసాద్ చెప్పారు. మండల పరిధి వెంట్రప్రగడలో గురువారం ఆయన వర్ల వ్యాఖ్యలను ఖండించారు. ఈ సందర్భంగా వరప్రసాద్ మాట్లాడుతూ.. వర్ల కుమార్ రాజా ఈనెల 26న మండల పర్యటనలో భాగంగా మోపర్రు గ్రామంలో ప్రభుత్వంపై, ఎమ్మెల్యే కైలేపై అనుచిత వ్యాఖ్యలను చేశారని, ఇది మంచి పద్ధతి కాదన్నారు. ఒళ్లు దగ్గర పెట్టుకుని మాట్లాడకపోతే భవిష్యత్‌లో గ్రామంలో తిరగనివ్వమని హెచ్చరించారు. పామర్రు నియోజకవర్గంలో నీ తండ్రి 2014 ఎన్నికల్లో ఓటమి పాలై అడ్రస్ లేకుండా పోయారని చెప్పారు. నీకు 2024లో ఇదే పరిస్థితి దాపురిస్తుందన్నారు. గ్రామాల్లో మీ పార్టీ వాళ్లు నిన్ను వసూల్ రాజా అని సంబోధిస్తున్నారని ఎద్దేవా చేశారు. నీ వల్ల మీ కేడర్ భయభ్రాంతులకు గురవుతుందని చెప్పారు.

ఇంటి ముంగిటకే ప్రభుత్వ సేవలు

కైకలూరు: జగనన్న సురక్ష కార్యక్రమం ద్వారా ఇంటి ముంగిటకే ప్రభుత్వ సేవలు అందిస్తున్నామని ఎమ్మెల్యే దూలం నాగేశ్వరరావు(డీఎన్నార్) చెప్పారు. కై కలూరు మండలం వింజరం సచివాలయం వద్ద ఆచవరం, వింజరం గ్రామాలకు సంబంధించిన జగనన్న సురక్ష క్యాంపు గురువారం జరిగింది. ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్యే మాట్లాడుతూ.. దేశ స్థాయిలో జగనన్న సురక్ష కార్యక్రమం సేవలపై ప్రశంసలు అందుతున్నాయన్నారు. నియోజకవర్గంలో 30 వేల ధ్రువీకరణ పత్రాలను పంపిణీ చేశామన్నారు. అనంతరం ప్రజలకు సర్టిఫికెట్లను పంపిణీ చేసి, సచివాలయం వద్ద మొక్కను నాటారు. కార్యక్రమంలో ఎంపీపీ అడివి కృష్ణ, జిల్లా వైఎస్సార్ సేవాదళ్ అధ్యక్షుడు బలే నాగరాజు, వైస్ ఎంపీపీ మహమ్మద్ జహీర్, మండల పార్టీ అధ్యక్షుడు భట్రాజు శివాజీ, సర్పంచ్‌లు ధర్మరాజుల నాగమణి, కట్టా నాగరాజు, జయమంగళ కాసులు, ఉప సర్పంచ్ పాము నిర్మల, నాయకులు ధర్మరాజుల సూర్యనారాయణ, బూరుబోయిన శ్రీనివాసరావు, బుర్ల పోతురాజు, సమ్మెట కృష్ణమూర్తి, తహసీల్దార్ బి.మురళీకృష్ణ, వివిధ శాఖల అధికారులు, పంచాయతీ పాలకవర్గ సభ్యులు, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.

426 సర్టిఫికెట్ల అందజేత

గుడివాడటౌన్: పట్టణానికి చెందిన 35వ వార్డు సచివాలయాల జగనన్న సురక్ష కార్యక్రమం గురువారం కొనసాగింది. స్థానిక కైకాల సత్యన్నారాయణ కళామందిరంలో జరిగిన కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ వి మురళీకృష్ణ పాల్గొన్నారు. 426 మంది లబ్ధిదారులకు ధ్రువీకరణ పత్రాలను అందజేశారు.



వింజరం గ్రామంలో సర్టిఫికెట్ అందజేస్తున్న ఎమ్మెల్యే డీఎన్నార్



గుడివాడలో ధ్రువీకరణ పత్రం అందజేస్తున్న మున్సిపల్ కమిషనర్ మురళీకృష్ణ

మున్సిపల్ మాజీ కౌన్సిలర్ వీరిశెట్టి నరసింహారావు, వైఎస్సార్ సీపీ జిల్లా అధికార ప్రతినిధి ఎంవీ నారాయణరెడ్డి, సీనియర్ నాయకులు మండలి హనుమంతరావు తదితరులు పాల్గొన్నారు.

చౌటపల్లిలో జగనన్న సురక్ష

గుడివాడరూరల్: ప్రజల ముంగిటకే పౌర సేవలను తీసుకువచ్చిన ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డికి దక్కుతుందని ఎంపీపీ గద్దే పుష్పరాణి అన్నారు. మండలంలోని చౌటపల్లి గ్రామంలో జగనన్న సురక్ష ముంగిపు కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. వివిధ రకాల ధ్రువీకరణ పత్రాలకు దరఖాస్తు చేసుకున్న 1,580 మంది లబ్ధిదారులకు ఎంపీపీ, జెడ్పీటీసీ సభ్యుడు గోళ్ల రామకృష్ణ, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు మట్టా జాన్‌విక్టర్, ప్రజాప్రతినిధులతో కలిసి అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. మండలంలో ఇప్పటి వరకు 10 వేల మందికి వివిధ రకాల ధ్రువీకరణ పత్రాలను అందజేశామన్నారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ప్రజల పక్షపాతి అని మరోమారు నిరూపించుకుందన్నారు. వైస్ ఎంపీపీ భట్టు నాగమల్లీశ్వరి, సర్పంచ్ వెలగలేటి రమ్య, తహసీల్దార్ కె.ఆంజనేయులు, ఎంపీడీవో వెంకటరమణ, ఈవో పీఆర్డీ దేవరపల్లి వెంకటేశ్వరరావు, సీనియర్ నాయకులు సూరపనేని కళ్యాణ్, గద్దే రాము, అట్లూరి గాంధీ, సచివాలయాల కన్వీనర్ కారే జోసఫ్, వివిధ శాఖల అధికారులు, సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లు, గ్రామస్తులు పాల్గొన్నారు.

జగనన్న సురక్షతో ప్రజలకు మేలు

పమిడిముక్కల: జగనన్న సురక్షతో ప్రజలకు మేలు జరుగుతుందని, అవసరమైన సర్టిఫికెట్లు త్వరితగతిన పొందేందుకు అవకాశం కలిగిందని తహసీల్దార్ డెక్కా రాజ్యలక్ష్మి, ఎంపీడీఓ సుధా ప్రవీణ్ తెలిపారు. మంత్రివాడ సచివాలయంలో జగనన్న సురక్ష క్యాంపు జరిగింది. ధరఖాస్తుదారులకు ఈఓఆర్డీ కె.వెంకటేశ్వరరావు, వైస్ ఎంపీపీ కొడమంచిలి మహేష్, ఎంపీటీసీ ఊబ మల్లేశ్వరి, సర్పంచ్ ఫ్రాన్సిస్, కార్యదర్శి తులసి సర్టిఫికెట్లను అందజేశారు.

నేడు విస్తృతంగా మొక్కలు నాటాలి

కలెక్టర్ రాజాబాబు ఆదేశం

చిలకలపూడి(మచిలీపట్నం): జిల్లా వ్యాప్తంగా శుక్రవారం మొక్కలు నాటే కార్యక్రమాన్ని పెద్ద ఎత్తున చేపట్టాలని కలెక్టర్ పి. రాజాబాబు అధికారులను ఆదేశించారు. గురువారం అధికారులతో టెలీ కాన్ఫరెన్స్ నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో పర్యావరణ పరిరక్షణలో భాగంగా పచ్చదనం పెంపుదల కోసం విస్తృతంగా మొక్కలు నాటాల్సిన అవసరం ఉందన్నారు. శుక్రవారం అన్ని ప్రభుత్వ కార్యాలయాలు, పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాలు, సచివాలయాల ఆవరణల్లో పెద్ద ఎత్తున మొక్కలు నాటే కార్యక్రమం నిర్వహించాలని చెప్పారు. ఇందుకు సమీపంలోని నర్సరీల నుంచి కావాల్సిన మొక్కలను తెచ్చుకుని సిద్ధంగా ఉంచుకోవాలన్నారు. ఈ కార్యక్రమాన్ని ఒక్క రోజుతో సరిపెట్టకుండా వాటి సంరక్షణ బాధ్యతలు కూడా చూసుకోవాలన్నారు. ముఖ్యంగా మహిళలు ఈ కార్యక్రమంలో అత్యధికంగా పాల్గొనేలా చూడాలన్నారు. గ్రామ, వార్డు సచివాలయ కార్యదర్శులు, స్వయం సహాయక సంఘాల మహిళలు, అంగన్‌వాడీ కార్యకర్తలు, ఉపాధి హామీ క్షేత్ర సహాయకులు, ఎంఈఓలు, ప్రధానోపాధ్యాయులు ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు చొరవ చూపాలని కోరారు. సంబంధిత ఎంపీడీఓలు, అటవీ శాఖ జిల్లా అధికారి, ఐసీడీఎస్, డీఆర్డీఏ, డ్వామా, ఉద్యాన శాఖాధికారులు ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. జిల్లాలోని డ్రెయిన్లలో పూడికలు తొలగించే పనిని ఏ కాంట్రాక్టర్లకు అప్పగించారు, ఏ డ్రెయిన్ల



కారణంగా పంట పొలాలు మునిగాయో వాటి వివరాలను వెంటనే అందజేయాలన్నారు. ఎన్ని రకాల పంటలు నీట మునిగాయో అంచనా వేసి నష్టం వివరాలు తెలియజేసే తాత్కాలిక నివేదికను వ్యవసాయాధికారులు అందజేయాలని చెప్పారు. మచిలీపట్నం నగర పాలక సంస్థ పరిధిలోని పేదలందరికీ ఇళ్ల నిర్మాణ కార్యక్రమంలో భాగంగా 4 వేల మంది స్వయం సహాయక సంఘాల మహిళలకు వెంటనే రుణాలు అందజేసి గృహాల నిర్మాణ పురోగతిని వేగవంతం చేయాలని సూచించారు. టెలీ కాన్ఫరెన్స్‌లో జేసీ అపరాజితసింగ్, డీఆర్వో వెంకటేశ్వర్లు, డీఎఫ్ఓ రాజశేఖర్, డీఈఓ తాహెరా సుల్తానా తదితరులు పాల్గొన్నారు.

డివిజన్ల వారీగా అధికారుల నియామకం..

జిల్లా వ్యాప్తంగా మొక్కలు నాటే కార్యక్రమానికి ఆయా డివిజన్ల వారీగా పర్యవేక్షణాధికారులను నియమిస్తూ జాయింట్ కలెక్టర్ అపరాజితసింగ్ ఉత్తర్వులు జారీ చేశారు. మచిలీపట్నం డివిజన్‌కు ఎంయూడీఏ వైస్ చైర్మన్ కె. రాజ్యలక్ష్మి, గుడివాడ డివిజన్‌కు గుడివాడ ఆర్డీఓ ఎ. పద్మావతిని నియమించారు. ఉయ్యూరు డివిజన్‌కు జిల్లా పౌరసరఫరాల అధికారి వి. పార్వతిని, ఓవరాల్ ఇన్‌చార్జీలుగా ఉద్యాన శాఖ ఏడీ జె. జ్యోతి, జిల్లా ఫారెస్ట్ ఆఫీసర్ రాజశేఖర్‌ను నియమించారు.

మొక్కల పెంపకంతో పర్యావరణ పరిరక్షణ

గుడివాడరూరల్: మొక్కల పెంపకంతో పర్యావరణ పరిరక్షించబడుతుందని ఎంపీపీ గద్దే పుష్పరాణి పేర్కొన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయం వద్ద గురువారం వెలుగు కార్యాలయ సిబ్బంది, పలువురు పంచాయతీ కార్యదర్శులకు మొక్కల పంపిణీ కార్యక్రమంలో ఎంపీపీ ముఖ్య అతిథిగా పాల్గొని పంపిణీ చేశారు. వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు మట్టా జాన్‌విక్టర్, ఎంపీడీవో వెంకటరమణ, ఉపాధి హామీ, వెలుగు అధికారులు, గద్దే రాము, సిబ్బంది పాల్గొన్నారు.

గుడివాడటౌన్: పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలని ఎన్టీఆర్ స్టేడియం వాకర్స్ క్లబ్ ఫౌండర్ అధ్యక్షుడు లోయ ఈశ్వర వెంకటేశ్వరరావు అన్నారు. వాకర్స్ కమిటీ సభ్యుడు దమ్మిటి శ్రీనివాసరావు తనయుడు తరుణ్ జన్మదినోత్సవం సందర్భంగా బైపాస్ రోడ్డుకు ఇరువైపులా 20 మొక్కలు నాటి వాటికి ట్రీ గార్డ్స్ ఏర్పాటు చేశారు. వాకర్స్ క్లబ్ సభ్యులు ఆర్జా ప్రసాద్, శివకృష్ణ, చిట్టిబాబు, కుటుంబరావు, జుజ్జవరపు వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.



మొక్కలు పంపిణీ చేస్తున్న ఎంపీపీ పుష్పరాణి

ముమ్మరంగా గుర్రపు డెక్క తొలగింపు



పుట్టగుంట బుడమేరు వంతెన వద్ద గుర్రపు డెక్క తొలగిస్తున్న సిబ్బంది



తోట్లవల్లూరులో చెరువును తలపిస్తున్న వరి పొలాలు

గుడివాడరూరల్: గుడివాడ నియోజకవర్గ పరిధిలో కాల్వలు, డ్రెయిన్లు పొంగడంతో గుర్రపు డెక్క, తూటికాడ తొలగింపు పనులు ముమ్మరం చేశారు. పొలాల్లో ఉన్న వర్షపు నీటిని బయటకు పంపే మార్గాలకు అన్వేషిస్తున్నారు. బుడమేరు, చంద్రయ్య, నెహ్రోల్లీ, మోటూరు, ఆత్కూరు డ్రెయిన్లు నీటి ప్రవాహంతో పొంగుతున్నాయి. బుడమేరుకు ఎగువ నుంచి వర్షపు నీరు వస్తుండటంతో పుట్టగుంట వంతెన వద్ద నీరు ప్రమాదకరంగా ప్రవహిస్తోంది. నీటి ప్రవాహం 18 అడుగులు చేరడంతో పరిసర ప్రాంతాల్లోని గ్రామాల్లో పంట పొలాలు ముంపునకు గురయ్యాయి. బుడమేరు ఉధృతంగా ప్రవహిస్తోందని, మరో రెండు అడుగులకు నీటి ప్రవాహం చేరితే గుడివాడ–హనుమాన్ జంక్షన్ రహదారిపై ఉన్న బుడమేరు వంతెనపై రాకపోకలకు ఇబ్బందులు తలెత్తే అవకాశం ఉందని రెవెన్యూ అధికారులు పేర్కొన్నారు.

అధికారుల పర్యవేక్షణ..

ఇప్పటికే నాలుగు ప్రొక్లెయిన్లు ఏర్పాటు చేసి నీటి ప్రవాహానికి అడ్డంగా ఉన్న గుర్రపుడెక్క, తూడును తొలగింపు పనులు చేపట్టారు. డ్రెయినేజీ, రెవెన్యూ శాఖ అధికారులు గ్రామాల్లోనే మకాం వేసి వరద ప్రవాహాన్ని ఎప్పటికప్పుడు గమనిస్తూ ప్రజలకు సూచనలు చేస్తున్నారు. చంద్రయ్య డ్రెయిన్‌కు నీటి ప్రవాహం అధికంగా రావడంతో పోలుకొండ వద్ద రెగ్యులేటర్ గేట్లు ఎత్తి నీటిని దిగువకు వదిలారు.

నెమ్మలూరులో మురుగు తొలగింపు

నెమ్మలూరు(పామర్రు): నెమ్మలూరు గ్రామంలో పంట కాలువలోని మురుగు తొలగించి గ్రామంలోని నీరు బయటకు పోయే విధంగా చర్యలు తీసుకున్నామని ఎంపీపీ దాసరి అశోక్‌కుమార్ అన్నారు. పంట కాలువ మురుగు తీత పనులు గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ వర్షాలకు గ్రామం అంతా నీటిమయంగా మారిందన్నారు. మురుగు తొలగించడంతో గ్రామంలోని వర్షపు నీరు బయటకు పోయిందని చెప్పారు. ఎంపీటీసీ పి.రత్నకుమారి, సర్పంచ్ నూకల గోపాలం పాల్గొన్నారు.

ముంపులోనే వరిపొలాలు

తోట్లవల్లూరు: వర్షాలతో వరి పొలాలు జలదిగ్బంధంలో చిక్కుకున్నాయి. పొలాల్లో నీరు భారీగా నిలిచిపోయింది. ఏనుగులకోడు డ్రెయిన్, కనకవల్లి, దేవరపల్లి డ్రెయిన్లు ముంపు నీటితో ఉధృతంగా ప్రవహిస్తుండటంతో పొలాల్లో నీరు బయటకు వెళ్లటం కష్టతరంగా మారుతోంది. తోట్లవల్లూరు బాడవలో వరినాట్లు పూర్తయిన పొలాలన్నీ వరద నీటిలోనే ఉన్నాయి.

పామర్రు: స్థానిక శివాలయం బజారు, గఫార్ సెంటర్, కోటిరెడ్డిపేట, బాపూజీ పేట తదితర ప్రాంతాల్లో రోడ్లపైన నిలిచిన నీటిని తొలగించారు. గ్రామ కార్యదర్శి సలీం, శానిటరీ మేస్త్రి ప్రేమ్‌కుమార్, శానిటరీ సిబ్బంది పర్యవేక్షించారు.

పంట రక్షణ చర్యలు చేపట్టాలి

తోట్లవల్లూరు: అన్నదాతలు పంట రక్షణ చర్యలు చేపట్టాలని మండల ఉద్యానశాఖాధికారి చందూజోసఫ్ తెలిపారు. మండలంలోని వల్లూరుపాలెంలో పలు ఉద్యాన పంటలను గురువారం ఆయన పరిశీలించారు. పసుపు, అరటి, కంద, తమలపాకు, బొప్పాయి పొలాల్లో ఎక్కువగా ఉన్న వర్షం నీటిని వెంటనే బయటకు పంపాలన్నారు. నాలుగు నుంచి వారం రోజులపాటు ముంపు నీటిలో ఉన్నట్లయితే పంటలు దెబ్బతినే అవకాశం ఉందన్నారు. ఆయా పంటల రక్షణకు తీసుకోవాల్సిన సస్యరక్షణ చర్యలను ఆయన రైతులకు వివరించారు. ముంపు నీటి కారణంగా పైరు దెబ్బతిన్న రైతులు ప్రత్యామ్నాయ పంటల సాగు చేపట్టాలని సూచించారు.

అధికారుల సలహాలు పాటించాలి

గుడివాడరూరల్: వర్షాలతో ముంపునకు గురైన పంట పొలాలను కాపాడుకునేందుకు రైతులు వ్యవసాయ శాఖాధికారుల సలహాలు పాటించాలని మండల వ్యవసాయ శాఖ అధికారి బి.అనంతలక్ష్మి కోరారు. మండలంలోని బొమ్ములూరు గ్రామంలో నీట మునిగిన పంట పొలాలను వ్యవసాయ శాఖ సిబ్బందితో కలసి గురువారం ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా ఏవో మాట్లాడుతూ.. జూన్, జూలై నెలల్లో వెదజల్లిన పంట పొలాల్లో, నారుమడుల్లో ప్రస్తుతం కురిసిన వర్షాల వలన పల్లపు ప్రాంతాల్లో పంట పొలాలను ముంపునకు గురయ్యాయన్నారు. దీని వలన నారుమడులు, వరినాట్లు దెబ్బతినే అవకాశం ఉందన్నారు. విత్తనం వెదజల్లిన 15 రోజుల లోపు ఉన్న నారుమడులు, వెదజల్లిన పొలాలకు సంబంధించి మూడు రోజుల కన్నా ఎక్కువ నీటిలో మునిగితే మొలకశాతం దెబ్బతింటుందన్నారు. పొలాల్లో ముంపు బయటకు పోయిన తర్వాత మాత్రమే యాజమాన్య చర్యలు చేపట్టాలని సూచించారు. మరిన్ని సలహాలు, సూచనలకు



వల్లూరుపాలెంలో అరటి పొలాన్ని పరిశీలిస్తున్న చందూజోసఫ్

గ్రామాల్లోని వ్యవసాయశాఖ సిబ్బందిని రైతులు సంప్రదించాలని ఆమె కోరారు.

రైతులకు ఎంపీడీఓ, ఏపీఓల సహకారం

మండవల్లి: అకాల వర్షాలకు మండవల్లి, ముదినేపల్లి మండలాల్లో పంట పొలాలు నీట మునిగాయి. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు రైతులకు పంట పొలాల్లో నీరు బయటకు పంపే క్రమంలో, డ్రెయిన్లను క్లియర్ చేయడంలో, ఇరిగేషన్, వ్యవసాయ శాఖలతో, ఎంపీడీఓలు, ఏపీఓలు కలిసి పనిచేయాలని డీపీఓ వై.రామకృష్ణ, వ్యవసాయ శాఖ ఏడీ జి.వెంకటమణి స్థానిక వ్యవసాయశాఖ కార్యాలయంలో గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. పంట పొలాల నుంచి నీటిని బయటకు తీసిన వెంటనే బూస్టర్ డోస్‌గా ఎకరానికి 20 కిలోల యూరియా, 15 కిలోల ఎంఓపీ కలిపి పొలంలో వేసుకోవాలన్నారు. జింకు ధాతు లోప నివారణకు ముడి జింకు లీటరు నీటికి 2 గ్రాముల చొప్పున ఎకరానికి 400 గ్రాములు పిచికారీ చేయాలన్నారు. లేదా చలామిన్ ఎకరానికి 100 గ్రాముల చొప్పున పిచికారీ చేయాలన్నారు.

30న కృత్రిమ అవయవాల కొలతలు

గుడివాడటౌన్: భారత్ వికాస్ పరిషత్ గుడివాడ శాఖ ఆధ్వర్యంలో ఈ నెల 30వ తేదీన కృత్రిమ అవయవ పరికరాల పంపిణీ, కొలతల కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు భారత్ వికాస్ పరిషత్ అమరావతి ప్రాంతీయ శాఖ అధ్యక్షుడు రూప్‌చంద్ జైన్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. స్థానిక బంటుమిల్లి రోడ్డులోని మార్వాడి సత్రంలో ఈ కార్యక్రమం జరుగుతుందన్నారు. గతంలో పేర్లు ఇచ్చిన వారికి పరికరాల పంపిణీ, అదేరోజు కృత్రిమ అవయవాలు అవసరం ఉన్న వారు ఇక్కడికి వచ్చి తమ పేర్లను, కొలతలను నమోదు చేసుకోవాలని ఆయన కోరారు.

కృష్ణానదిలో కొనసాగుతున్న వరద



పడవపై రాకపోకలు సాగిస్తున్న పాములలంక గ్రామస్తులు

తోట్లవల్లూరు: కృష్ణానదిలో వరద ప్రవాహం కొనసాగుతోంది. వర్షాల కారణంగా ఎగువ ప్రాంతాల నుంచి వస్తున్న వరద నీటిని విజయవాడ ప్రకాశం బ్యారేజీ నుంచి దిగువకు విడుదల చేస్తున్నారు. దీంతో కృష్ణానది పరివాహక ప్రాంతం జలకళను సంతరించుకుంది. గురువారం 1.34 వేల క్యూసెక్కుల వరద నీటిని బ్యారేజీ నుంచి విడుదల చేసినట్లు అధికారులు తెలిపారు. వరద రాకతో కృష్ణానది పాయల్లో ఉన్న రహదారులు నీటి మునగటంతో పాములలంకతో పాటు పలు లంక గ్రామాల ప్రజలు, వ్యవసాయ పనుల కోసం కరకట్ట వెంబడి గ్రామాల నుంచి లంకలకు వెళ్లే రైతులు, కూలీలు పడవలపై రాకపోకలు సాగిస్తున్నారు.